క్లుప్తంగా

వినాయక విగ్రహాలకు అనుమతి తప్పనిసరి


ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: వినాయక మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్సై కె.మాధవరావు అన్నారు. విగ్రహాల వద్ద వలంటీర్లు ఏర్పాటు చేయాలన్నారు. మండపాల వద్ద మత్తు పానీయాలు తాగరాదని, పెద్ద పెద్ద శబ్దాలతో డీజేలు ఏర్పాటు చేయరాదన్నారు. విగ్రహాల వద్ద అభ్యంకర నృత్యాలు నిషేధమన్నారు. వారిపై శాఖాపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థినులకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

సింగరాయకొండ: జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థినులు వి.గౌతమి, జి.మహేశ్వరి ద్వితీయ బహుమతి సాధించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ సౌజన్య తెలిపారు. ఒంగోలు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థినులకు లెప్రసీ, ఎయిడ్స్, టీబీ శాఖల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. 20 కాలేజీల నుంచి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ద్వితీయ బహుమతి రూ.4 వేలు అందజేశారు. ప్రిన్సిపాల్ సౌజన్య, అధ్యాపకులు బహుమతి సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

కాలభైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


కాలభైరవస్వామి

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని కె.బిట్రగుంట కాలభైరవస్వామి ఆలయంలో శనివారం శ్రావణమాస అమావాస్య పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలభైరవస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు గుమ్మడికాయల్లో దీపాలు వెలిగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. సుమారు 2 వేల మంది భక్తులు పాల్గొనగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఆలయంలో గుమ్మడి కాయలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నేడు ఉపకరణాల నిర్ధారణ శిబిరం

కొండపి: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి దివ్యాంగ పిల్లలకు ఉపకారణాల నిర్ధారణ శిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు కె.సురేఖ, పి.రామారావులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాల్లోపు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగులు, ప్రత్యేక అవసరాల పిల్లలకు నియోజకవర్గ స్థాయిలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరాన్ని ఆరేళ్ల నుంచి 18 ఏళ్ల దివ్యాంగ పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకోవాలని సూచించారు. వచ్చేటప్పుడు రెండు ఫొటోలు, ఆధార్ కార్డ్, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, రేషన్ కార్డ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకు రావాలని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ కుబేర పూజలు


ఆలయంలో లక్ష్మీ కుబేర పూజలు

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని కోదండరామస్వామి దేవస్థానంలో శనివారం శ్రావణమాస అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని లక్ష్మీ కుబేర పూజలు నిర్వహించారు. పూజల్లో 108 మంది మహిళలు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా కోదండరాములవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

కలగా ఆయకట్టు సేద్యం

- ఏళ్ల తరబడి నిండని చెరువులు
- పూర్తిగా తగ్గిన వరిసాగు విస్తీర్ణం
- బోర్ల కింద మెట్ట పంటల సాగు


సాగుకు నోచుకోని ఆయకట్టు భూమి



మర్రిపూడి చెరువులో చిల్లచెట్లు ఏపుగా పెరిగిన దృశ్యం

మర్రిపూడి:

మండలంలో కొన్నేళ్లుగా ఏ చెరువు పూర్తిస్థాయిలో నిండకపోవడంతో ఆయకట్టు సేద్యం కలగా మారింది. మండలంలో 13 ఇరిగేషన్, 18 పంచాయతీ చెరువులు ఉన్నాయి. కొన్నేళ్లుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నా ఏ చెరువులోకి పూర్తిస్థాయిలోకి వర్షం నీరు చేరలేదు. దీంతో బోర్లపై ఆధారపడి రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం గుండ్లసముద్రం, మర్రిపూడి, కెల్లంపల్లి, చిమట, వేమవరం తదితర ఇరిగేషన్ చెరువుల్లో నీరు లేకపోవడంతో ఆయకట్టు అంతా బీడు భూములను తలపిస్తున్నాయి. చెరువులకు ఏర్పాటు చేసిన తూములన్నీ తుప్పుపట్టి పోయాయి. చెరువుకట్టలు మరమ్మతుకు నోచుకోకపోవడంతో చెరువు కట్టపై చిల్ల చెట్లు విపరీతంగా పెరిగి చెరువుకట్టలు బలహీనపడ్డాయి. పంటకాలువలు సైతం పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తంగెళ్ల, వల్లాయపాలెం, కెల్లంపల్లి తదితర చెరువులోకి కొద్దిపాటి వర్షం నీరు చేరింది. ఆయా చెరువుల్లోకి కొద్దిపాటి వర్షం నీరు చేరడంతో తక్కువ రకం వడ్లు నాటేందుకు నారుపోసేందుకు రైతులు సిద్ధమౌతున్నారు. చెరువుల్లోని గుంటల్లోని నీరు శివారు భూములకు అందే అవకాశం లేకపోవడంతో బోర్లపై ఆధారపడి వరి సాగుచేస్తున్నారు.

మర్రిపూడి చెరువు కింద 500 ఎకరాల ఆయకట్టు

మర్రిపూడి చెరువు నిండ దాదాపు 20 ఏళ్లు అవుతుంది. దాదాపు వందల ఎకరాలు విస్తరించి ఉన్న ఈ చెరువుకు నీరు చేరక ఆయకట్టు అంతా పిచ్చిచెట్లు మొలిచి చిట్టడవిని తలపిస్తోంది. దాదాపు 500 ఎకరాలు ఆయకట్టు బీడు భూములను తలపిస్తున్నాయి. దీంతో చేసేదిలేక మర్రిపూడి చెరువు కింద రైతులు మెట్టపైర్లు సాగు చేస్తున్నారు. మండలంలో దాదాపు 3500 హెక్టార్ల విస్తీర్ణంలో పలు గ్రామాల చెరువుల ఆయకట్టు కింద వరిసాగు చేయాల్సి ఉండగా ఇప్పటికే 150 హెక్టార్లలో మాత్రమే వరిపంట సాగు చేసేందుకు నారు పోసేందుకు సిద్ధమయ్యారు. బోర్ల కింద మరో 140 హెక్టార్లలో రైతులు వరి సాగుచేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇటీవల కురిసి వర్షానికి బోర్లల్లోకి చేరడంతో మండలంలోని గంగపాలెం, వేమవరం, పొట్టిరెడ్డిపాలెం ఆయకట్టు కింద అడపాదడపా రైతులు వరి సాగుచేసేందుకు సిద్ధమయ్యారు. బోర్లు ఆధారంగా తిండిగింజలు, పశువులమేత కోసం పంట పండించుకోవాలనే తపనతో వరిసాగు చేస్తున్నారు. తిండిగింజలు, పశువులమేతకు ఈ ఏడాది తిప్పలు తప్పవని రైతులు అంటున్నారు. బోర్లలో నీరు సంవృద్ధిగా లేకపోయినా వర్షాలపై ఆధారపడి కొందరు రైతులు పంటలు సాగుచేస్తున్నారు. సరిపడినంత నీరు చెరువులో లేకపోవడంతో తక్కువ రకం వరిసాగుచేయాలని ఆలోచనలో రైతులు ఉన్నారు.


శిథిలావస్థకు చేరిన చెరువు తూము

గిట్టుబాటు ధర అంతంతమాత్రమే..

గతేడాది బస్తా వడ్లు రూ.1400 నుండి రూ. 2వేలు ధరపలికింది. ఆరుగాలాలపాటు పండించిన దాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతులు అంటున్నారు. వరిపంట కష్టంచి పండించినా మార్క్‌ఫెడ్ ద్వార కొనుగోలు చేయడం లేదని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి చెరువుల్లో, కరకట్టపై ఏపుగా పెరిగిన చిల్లచెట్లను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

చెరువు కట్ట కోతకు గురికాకుండా చూడాలి:



వర్షం కురిసినప్పుడు తంగెళ్ల చెరువుకట్ట కోతకు గురవుతోంది. దీంతో కట్ట బలహీనపడింది. చెరువు కట్ట కోతకు గురికాకుండా కట్టకు రివిట్‌మెంట్ పనులు చేపట్టాలి.

ఎస్‌కే అబ్దుల్ గపూర్, తంగెళ్ల

పిచ్చిచెట్లు తొలగించాలి:



వేమవరం గ్రామంలోని చెరువు వర్షం నీటితో నిండి దాదాపు 7 ఏళ్లయింది. చెరువు పైభాగాన అడ్డుకట్టలు వేయడంతో చెరువులోకి వర్షం నీరు వచ్చే అవకాశం లేదు. చెరువులోపల, చెరువు కట్టపై పిచ్చిచెట్లు పెరిగిపోయాయి. దీంతో ఆయకట్టు బీడుభూములుగా మారాయి. పంటకాలులు లేక ఏడు ఏళ్లుగా వరిసాగు చేయడం లేదు. మరమ్మతులు చేయాలి.

కొమ్ము యహోను (వేమవరం)

ప్రకాశం పంతులు చిరస్మరణీయుడు


పీసీపల్లిలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులు


టంగుటూరు గ్రంథాలయంలో నివాళులు

సీఎస్‌పురం(పామూరు): స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయుడని కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్న గౌడ్ అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు న్యాయవాదిగా పనిచేస్తూ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్ వారిని గడగడలాడించిన మహోన్నత వ్యక్తి ప్రకాశం పంతులు అన్నారు. ప్రకాశం జీవితం నేటి యువతకు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పీసీపల్లి: మండల పరిధిలోని పెద్ద అలవలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హనుమంతరావు, ఎంఈఓ శ్రీనివాసచారి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. యుఆర్‌డీ రాంప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

టంగుటూరు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఆదర్శనీయమని గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధన్‌రాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

కనిగిరిరూరల్: ప్రకాశం పంతులు సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కమిషనర్ పి.కృష్ణమోహన్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, హెల్త్ ఇన్‌పెక్టర్ చెన్నకేశవులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక వికలాంగుల హక్కుల వేదిక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ధూళిపాళ్ల మల్లికార్జునరావు, వేగినాటి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

పొగాకు గరిష్ట ధర రూ. 299


కొండపిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ట ధర రూ.299 పలికిందని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కట్టవారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 737 బేళ్లను వేలానికి తీసుకురాగా 474 బేళ్లను కొనుగోలు చేసి 263 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.139, సరాసరి ధర రూ.224.43గా నమోదైంది. వేలంలో 17 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక వేలంకేంద్రంలో శనివారం జరిగిన వేలంలో 263 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. చింతలపాలెం, దావగూడూరు గ్రామాలకు చెందిన రైతులు 811 బేళ్లను వేలానికి తీసుకురాగా 502 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.299, కనిష్ట ధర రూ.140, సరాసరి ధర రూ.195.09గా నమోదైంది. వేలంలో 40 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: పట్టణంలోని పామూరు రోడ్డులో విద్యుత్‌లైన్ పనులు జరుగుతున్న కారణంగా పామూరు రోడ్డు 11 కేవీ ఫీడర్ పరిధిలోని గాయత్రీనగర్, కొత్తకుమ్మరిపాలెం, ప్రశాంతినగర్, సింహాద్రినగర్, ఎర్రవడ్డిపాలెం, పామూరు బస్టాండ్ ఏరియా, వెంకటేశ్వరనగర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ టీవీ నరసింహం తెలిపారు. ఉదయం 9.00గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

పొదుపు అక్రమాలపై కొనసాగుతున్న విచారణ

పామూరు: మండల పరిధిలోని గోపాలపురం క్లస్టర్ పరిధిలో చోటుచేసుకున్న పొదుపు గ్రూపుల అక్రమాలపై విచారణ కొనసాగుతోంది. ఈ సందర్భంగా శనివారం ఏపీడీ లక్ష్మిరెడ్డి స్థానిక వెలుగు కార్యాలయంలో విచారణ చేపట్టారు. గోపాలపురం వీఓఏ బేబి బ్యాంకు లింకేజి, సీసీఎల్, స్త్రీనిధి, సీఏఎఫ్, ఉన్నతి రుణాలకు సంబంధించి సభ్యులకు తెలియకుండా సుమారు రూ.37 లక్షల మేర అక్రమాలు చోటుచేసుకున్నట్లు సభ్యులు ఇటీవల జిల్లా అధికారులకు ఫిర్యాదుచేశారు. దీనిపై కలెక్టర్, డ్వామా పీడీ ఆదేశాల మేరకు విచారణ చేపడుతున్నట్లు వారు తెలిపారు. విచారణలో డీపీఎం దానం, హెచ్‌డీ నారాయణ, ఆదిశేషయ్య, ఏజీఎం ఉదయ్‌కుమార్, ఏపీఎం విద్యాసాగర్ పలువురు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండండి


మాట్లాడుతున్న సీఐ అన్వర్‌బాషా

కందుకూరు రూరల్: చిన్నతనం నుంచే విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ అన్వర్‌బాష సూచించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. సమాజంలో గంజాయి, డ్రగ్స్ వంటివి వేగంగా వ్యాపిస్తున్నాయని, ఇటువంటి అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైనా వీటి సమాచారం ఉంటే వెంటనే తల్లిదండ్రులకు గాని, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వ్యసనాలకు బానిసైతే జీవితం దుర్భరంగా మారుతుందన్నారు. అలాగే సైబర్ నేరాలపై కూడాఅప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నతనం నుంచి విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లు వాడుతున్నారని, సోషల్‌మీడియాలో వచ్చే వివిధ ప్రకటనలు చూసి పెడదోవ పట్టవద్దన్నారు. విద్యార్థుల ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి గమనిస్తూ ఉండాలన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పట్టణ ఎస్సై శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా


సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలుపుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

కొండపి: కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 12:30 గంటల వరకు సభ్యుల కోసం ఎదురుచూసినట్లు తెలిపారు. ఎంపీపీ స్వర్ణకుమారి తప్ప మిగతా సభ్యులు హాజరుకాకపోవడంతో మధ్యాహ్నం ఒంటి గంటలకు సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి సమావేశాల వివరాలను త్వరలోనే తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా అధికారులు.

మండల సర్వసభ్య సమావేశాన్ని ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తామని అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో రావాలని ఎంపీడీఓ రామకృష్ణ తెలపగా ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కేవలం కొద్ది మంది అధికారులు మాత్రమే 11 గంటలకు సమావేశ హాలుకు రాగా దాదాపు 70 శాతం అధికారులు గంట ఆలస్యంగా సమావేశానికి చేరుకున్నారు. కొంతమంది పంచాయతీ సెక్రటరీ సచివాలయంలో అందుబాటులో లేక సమావేశానికి రాక ఎటు పోయారో అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నారని ప్రజలు చర్చించుకున్నారు. సచివాలయాల్లో అడిగితే సర్వసభ్య సమావేశానికి వెళ్లారని తీరా సర్వసభ్య సమావేశంలో చూస్తే తమ సొంత పనులు ముగించుకొని నిదానంగా సమావేశానికి వస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. దాదాపు అన్ని శాఖల అధికారులు సర్వసభ్య సమావేశంపై నిర్లక్ష్య ధోరణిలో కొనసాగుతున్నారని కొంతమంది అధికారులు గుసగుసలాడుకున్నారు.

వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం


సదస్సులో వినియోగదారుల సమస్యలు వింటున్న అధికారులు

సింగరాయకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యలు సత్వరమే పరిష్కరించే లక్ష్యంగా అవగాహన సదస్సు నిర్వహించి సమస్యలు వెంటనే పరిష్కరిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల ఫోరం, సమస్యల పరిష్కార వేదిక చైర్మన్, రిటైర్డ్ జడ్జి ఎన్ విక్టర్ ఇమాన్యుయేల్ అన్నారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ కాకతీయ కళ్యాణ మండపంలో శనివారం విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరాయకొండ గ్రామ పంచాయతీలోని ఇస్లాంపేటలో లోటల్టేజీ సమస్య, ఉలవపాడు మండలం చాకిచర్లలో పాత విద్యుత్ స్తంభాలు మార్చాలని, ఆత్మకూరులో విద్యుత్ కండక్లర చోరీ అయిందని, కొత్తది ఏర్పాటు చేయాలని అర్జీలు వచ్చాయన్నారు. కొంతమంది వినియోగదారుల సమస్యలు సదస్సు దృష్టికి తీసుకుని రాగా వాటిని వెంటనే పరిష్కరించారు. విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, డీఈఎం నాగేశ్వరరావు, ఏడీఈ పి.యుగంధర్, ఏఈలు సాంబశివరావు, హరీష్, పువ్వాడ శ్రీనివాసులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

పామూరు: వినాయక చవితి పండుగ, నిమజ్జన వేడుకలను ప్రజలు శాంతియుతంగా, సామరస్యంగా నిర్వహించుకోవాలని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ఎం భీమానాయక్ హెచ్చరించారు. స్థానిక సర్కిల్ కార్యాలయం ఆవరణలో శనివారం ఎస్సై టి.కిషోర్‌బాబు అధ్యక్షతన విగ్రహ ఏర్పాటు కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ భీమానాయక్ మాట్లాడుతూ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు విధిగా అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటుచేస్తే కఠినచర్యలు తప్పవన్నారు. విగ్రహాలవద్ద ఎలాంటి పేలుడు వస్తువులు లేకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. నిమజ్జనం రోజున ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా విగ్రహ ఏర్పాటు కమిటీ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. నిమజ్జన కార్యక్రమాన్ని మధ్యాహ్నం 1:30 గంటకల్లా ప్రారంభించేలా చూడాలన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి సారించాలి


వర్మీ కంపోస్టు పిట్లను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి

పామూరు: చెత్త నుంచి సంపద తయారీపై పంచాయతీ అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని డీఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీచేశారు. ఈసందర్భంగా వర్మీ కంపోస్ట్ తయారీ యూనిట్లను పరిశీలించారు. అనంతరం పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సచివాలయాలను ఆయన తనిఖీచేసిన డీఎల్‌డీఓ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, పెండింగ్ పనులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీఓ కే.సుందరరామయ్య, పీఎస్ జి.అరవిందారెడ్డి, ఉపసర్పంచ్ యాదాల వెంకట సాయికిరణ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు


బస్టాండ్‌లో వసతులపై చర్చిస్తున్న డీపీటీఓ, డీఎం

పామూరు: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డీపీటీఓ గడ్డం సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను శనివారం కనిగిరి డీయం మమ్మద్ సయానాబేగంతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో వసతులపై ప్రయాణికులతో చర్చించారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించి ప్రస్తుతం ఉన్న బస్ సర్వీసులనే అదనపు ట్రిప్పులు వేయిస్తున్నట్లు తెలిపారు. బస్టాండ్‌లో వసతులను పరిశీలించిన ఆయన డీఎంకు పలు సూచనలు చేశారు. అనంతరం సీఎస్‌పురం బస్టాండ్‌ను పరిశీలించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ హనుమంతరావు

పీసీపల్లి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ హనుమంతరావు అన్నారు. మండల పరిధిలోని అలవలపాడులో స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్రపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎంఈఓ శ్రీనివాసచారి, సంజీవ్, యుఆర్‌డీ రాంప్రసాద్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

